క్లుప్తంగా

11న కొబ్బరికాయల వేలం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23న ప్రారంభమై జనవరి1 వరకు కొనసాగుతాయని ఆలయ ఈఓ స్నేహలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 11న ఉదయం 11.30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కొబ్బరికాయల వేలంపాట నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

దళారులను ఆశ్రయించవద్దు: ఏఓ

మాడ్గుల: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి గౌతమ్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మాడ్గులలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ.. వరి గ్రేడ్‌–ఏ రకానికి రూ.2,203 మరియు గ్రేడ్‌–బీ రకానికి రూ.2,183 మద్దతు ధర అందిస్తున్నామని తెలిపారు. తేమ 17 శాతం లోపల ఉండాలన్నారు. కేంద్రాలకు వచ్చే రైతులు.. తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకోని రావాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని.. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు

ఫార్మాసిటీ కేసులు ఎత్తేయాలి: సీపీఎం

యాచారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేస్తానని చెప్పడం సంతోషకరమని.. అదే విధంగా ఫార్మాసిటీ వద్దని ఆందోళన చేసిన రైతులపై బీఆర్‌ఎస్ సర్కార్ పెట్టిన కేసులను ఎత్తేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన యాచారంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కార్ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఫార్మాసిటీ ఏర్పాటుకు సిద్ధమైందని మండిపడ్డారు. రైతులతో పాటు సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించిందని ఆరోపించారు. ఫార్మాసిటీ కేసులు ఎత్తేసే విషయంలో ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి కృషి చేయాలని కోరారు.

భక్తిభావం కలిగిఉండాలి

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మదేవి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పచ్చిన తోరణాలు, పుష్పాలతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ కొప్పుల శేఖర్‌గౌడ్, నాయకులు వీరేశ్, కొండయ్య, తిరుపతయ్యగౌడ్, నర్సింహగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: అధికారులు ధాన్యం కొనుగోళ్లపై దృష్టిపెట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ... మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్న దృష్ట్యా అవసరమైన గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా సేకరించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వారం రోజుల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేయాలని అధికారులకు సూచించారు.

దివ్యాంగ జంటలకు ఉచిత వివాహం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మొగుళ్లపల్లి యువసేన సభ్యులు

చైతన్యపురి: రెండు దివ్యాంగ జంటలకు మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో ఉచితంగా వివాహం జరిపించారు. హనుమంతరావు– అంజనమ్మ, లావణ్య– నర్సింహ జంటలకు దాతల సహకారంతో అవసరమైన బంగారు పుస్తెలు, మెట్టెలు, పట్టువస్త్రాలను అందజేసి వేదబ్రాహ్మణులచే హిందూ సాంప్రదాయం ప్రకారం పెళ్లి జరిపించామని సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా తెలిపారు. అనంతరం వధూవరుల బంధుమిత్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఈడీ దివ్యాంగుల సంస్థ చైర్మన్ గంగారాం, నర్సింగరావు, నాగభూషణరావు, బాబూరావు, రమేష్ పాల్గొన్నారు.

ఎందుకిలా జరిగింది?

- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- అన్ని మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ
- తప్పెక్కడ జరిగిందంటూ బూత్‌స్థాయి నేతల వద్ద ఆరా



ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలింగ్‌కు ముందురోజు వరకు అంతా బాగానే ఉందని అందరూ అనుకున్నారు... మరీ ఇంత చేదుగా ఫలితం ఉంటుందని ఎవరూ ఊహించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై 36,700 ఓట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలవడం బీఆర్‌ఎస్ శ్రేణులకు మింగుడుపడటంలేదు. ఎందుకిలా జరిగింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తించలేదా లేక క్షేత్ర స్థాయిలోకి ఈ విషయాన్ని తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు విఫలం ఆయ్యారా... కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజాక్షేత్రంలో వేసిన పాచికలను, ఎత్తు జిత్తులను సరైన రీతిలో తిప్పికొట్టలేకపోయామా అనే కోణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆత్మపరిశీలన చేసుకుంటున్నారు. గత నాలుగేళ్లలో సుమారు రూ.3వేల కోట్లతో నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పరిచినా, జిల్లా కలెక్టరేట్‌తోపాటు పలు డివిజన్ కార్యాలయాలను, పలు సంస్థలను ఇక్కడే ఏర్పాటు చేసినా, రోడ్లు, మంచినీటి వ్యవస్థలను చక్కదిద్దినప్పటికీ మరెందుకు ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డిని ఆదరించకుండా తిరస్కరించారని లోలోపల మదనపడుతున్నారు. ప్రత్యర్థికి ధీటుగానే అంగఅర్ధబలాలను ఈ ఎన్నికల్లో ప్రదర్శించినా ఇంత ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి రావడం ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు, ఫోజులకు తగ్గట్టుగా బీఆర్‌ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో వారి పనితనాన్ని చూపట్టలేకపోయారని టాక్. ఇదిలావుంటే రాష్ట్ర స్థాయిలో బీజేపీ 8 సీట్లు సాధించి పుంజుకోవడం, బీఆర్‌ఎస్‌కు 39 స్థానాలు దక్కినా మరి ఇక్కడెందుకు పరాజయాన్ని ముటగట్టుకున్నామనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తుండటం, వరుస అపజయాలతో ఇక్కడి ప్రజల్లో ఆపార్టీ అభ్యర్థి రంగారెడ్డికి ఏర్పడిన సానుభూతి, అధికార పార్టీపై ఉద్యోగుల వ్యతిరేకత తదితర ప్రధాన కారణాల వలనే తమ అభ్యర్థి ఓటమి పాలైనట్లు బీఆర్‌ఎస్ శ్రేణులు సర్దిచెప్పుకొస్తున్నారు.

మండలాల వారీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు

మండలాలు	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	మెజార్టీ
యాచారం	20,313	12,720	7,593
మంచాల	17,253	11,170	6,083
ఇబ్రహీంపట్నం	29, 691	20,541	9,150
అబ్దుల్లాపూర్‌మెట్	57,317	44,742	12,575
పోస్టల్ బ్యాలెట్	1,932	633	1,299
మొత్తం	1,26,506	89,806	36,700

ఏ మండలంలోనూ రాని ఆధిక్యత

నియోజకవర్గంలోని ఏ ఒక్క మండలంలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఆధిక్యత రాలేదు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలన్నింటిలో బీఆర్‌ఎస్ పూర్తిగా వెనుకబడిపోయింది. అదేవిధంగా కౌంటింగ్‌లోని 25 రౌండ్లలో కూడా ఏ ఒక్క రౌండ్‌లో కిషన్‌రెడ్డి అధిక్యతను ప్రదర్శించకపోవడం గమనార్హం. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రతి రౌండ్‌లో, ప్రతి మండలంలో ఆధిక్యత చాటుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బూత్‌స్థాయి నేతల వద్ద ఈవిషయమై ఆరా తీస్తున్నారు.

బీజేపీ, సీపీఎంకు వచ్చిన ఓట్లు

బీజేపీ, సీపీఎం అభ్యర్థులకు మండలాల వారీగా పడిన ఓట్లు ఈవిధంగా ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌కు యాచారం మండలంలో 2,375, మంచాల మండలంలో 1,826, ఇబ్రహీంపట్నం మండలంలో 2,917, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 8,396 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 276తో కలిపి మొత్తం 15,790 ఓట్లు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు యాచారం మండలంలో 1,008, మంచాల మండలంలో 1,771 ఓట్లు, ఇబ్రహీంపట్నం మండలంలో 680 ఓట్లు, అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో 418 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 71తో కలిపి మొత్తం 3,948 ఓట్లు సాధించి నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. కాగా అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థి కే.కిషన్‌రెడ్డికి నియోజకవర్గంలో 2,356 ఓట్లు రావడం గమనార్హం. బీఎస్పీ అభ్యర్థి గొరిగే మల్లేశ్‌కు కేవలం 2,114 ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నోటాకు 1,427 ఓట్లు రాగా.. బరిలో ఉన్న మిగతా అభ్యర్థులకు 900 ఓట్లలోపే వచ్చాయి. కాగా 2018 ఎన్నికల్లో 17వేల పైచిలుకు ఓట్లు బీజేపీకి, 8వేల పైచిలుకు ఓట్లు సీపీఎంల అభ్యర్థులకు రాగా ఈసారి భారీగా ఓట్లు తగ్గడం శోచనీయం. ఈ నియోజకవర్గంలో సీపీఎం పట్టు రోజురోజుకు దిగజారుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మానకొండూరు ఎమ్మెల్యే మనవాడే

- ఇబ్రహీంపట్నంతో సత్యనారాయణకు అనుబంధం
- ఇక్కడ అంకిత్ ఆస్పత్రి స్థాపించి వైద్యసేవలు



ఎమ్మెల్యే సత్యనారాయణను సన్మానించిన మహేశ్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఇబ్రహీంపట్నం ప్రజలతో ఎంతో అనుబంధం ఉంది. సత్యనారాయణతోపాటు ఆయన సతీమణి అనురాధ ఇద్దరూ ప్రముఖ వైద్యులే. ఇబ్రహీంపట్నంలో 27 ఎళ్ల క్రితం ముఖ్యంగా మహిళలకు సంబంధించిన వైద్యులు ఎవ్వరూ లేరు. ఆ సమయంలో ఇక్కడ అంకిత్ ఆస్పత్రిని స్థాపించి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు మండలాల ప్రజలకు గైనకాలజిస్ట్‌గా అనురాధ సేవలందించారు. ప్రభుత్వ వైద్యుడిగా పని చేస్తూ సతీమణి పెట్టిన అంకిత్ ఆస్పత్రిలోని పేషెంట్లను జనరల్ సర్జన్‌గా సత్యనారాయణ పరీక్షించేవారు. ప్రతి పేషెంట్‌ను నవ్వుతూ పలకరిస్తూ అందరితో కలుపుగోలుగా ఉండటంతో సత్యనారాయణకు ప్రజలతో మంచి సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ముందు నుంచి రాజకీయాలంటే వారికి ఎంతో ఆసక్తి, మక్కువ. ఇబ్రహీంపట్నం ఎస్సీ రిజర్వ్‌గా ఉన్నప్పుడు 1999లో ఆయన సతీమణి అనురాధ టీడీపీ నుంచి టికెట్‌కు ఆశించింది. చివరి నిమిషంలో టికెట్ లభించకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు. ఆ తదుపరి ఆమె భర్త సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన మానకొండూరుపై దృష్టి పెట్టి కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని, ఇప్పుడు ఎమ్మెల్యేగా 32వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు సైతం సత్యనారాయణ గెలుపును హర్షిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఇబ్రహీంపట్నంతోపాటు నగరంలోని సంతోష్‌నగర్‌లో అంకిత్ పేరుతో వారి ఆస్పత్రులు కొనసాగుతున్నాయి.

సత్యనారాయణకు సన్మానం..

ఎమ్మెల్యేగా విజయం సాధించిన కవ్వంపల్లి సత్యనారాయణను నగరంలో గురువారం ఇబ్రహీంపట్నానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్ల మహేశ్‌గౌడ్ కలిసి సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇబ్రహీంపట్నంలో అంకిత్ ఆస్పత్రి పెట్టినప్పటి నుంచి సత్యనారాయణతో తనకు మంచి స్నేహం ఉన్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

మలక్‌పేట: కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి తెలిపారు. సలీంనగర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. సెక్రటరీ జనరల్ వినయ్‌కుమార్,కోశాధికారి ప్రసాద్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి నుంచి తరలిన నాయకులు

ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం జరిగిన రేవంత్‌రెడ్డి సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దొరల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిందని.. ఇప్పుడు ప్రజాపాలన దిశగా అడుగులు వేస్తామన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: ప్రమాణ స్వీకారోత్సవ సభకు హాజరైన నేతలు



ఆమనగల్లు: పోలెపల్లి నుంచి తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే సబితారెడ్డి

- ప్రజాతీర్పును గౌరవిస్తాం
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడుతాం

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో ఇక్కడ చేసిన అభివృద్ధిని చూసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తనను గెలిపించిన ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఇక నుంచి ప్రతీ గ్రామంలో పర్యటించి ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడుతామన్నారు. అంతకు ముందు శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి భారీ ర్యాలీగా పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీపీ కె. సునీతా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్. శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆనందం, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, కూన యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అభివృద్ధికి నోచుకోని ఆడిటోరియం

- ఖాళీ స్థలాన్ని అద్దెకిస్తూ కాలం గడుపుతున్న అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు



కళావిహీనంగా ఆడిటోరియం వేదిక

వనస్థలిపురం: స్థానికుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం వనస్థలిపురంలో నిర్మించిన హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నేడు శిథిలావస్థకు చేరుకుంది. ఆడిటోరియం వేదిక కళావిహీనంగా మారి, ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలు, చెత్తా చెదారానికి నిలయంగా మారింది. అటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆడిటోరియం అధ్వానంగా మారింది. హెచ్‌ఎండీఏ అధికారులు ఆడిటోరియం అభివృద్ధిని వదిలేసి ఆడిటోరియంలోని ఖాళీ స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. వనస్థలిపురంలో స్థానికుల అవసరాలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం అప్పటి హుడా ఆధ్వర్యంలో 1998లో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించారు. మొదట్లో స్థానికుల అవసరాలకు ఉపయోగపడిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం అనంతరం నిర్వహణ లోపంతో మౌలిక వసతులు కరువై స్థానికుల ఫంక్షన్లకు ఉపయోగపడకుండా పోయింది. ఆడిటోరియంను అభివృద్ధి చేయాల్సిన అధికారులు ఆ విషయాన్ని వదిలేసి ఎలాగూ అద్దెలు వస్తున్నాయన్న కారణంతో సదరు స్థలాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ లబ్ధి పొందుతున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుందామన్న స్థానికులకు ఓపెన్ ఆడిటోరియం అందుబాటులో లేకుండాపోయింది.

అన్యాక్రాంతమవుతున్న ఆడిటోరియం

వనస్థలిపురంలోని హుడా ఆడిటోరియం రోజురోజుకూ అన్యాక్రాంతమవుతోంది. ఇప్పటికే ఆడిటోరియం స్థలంలో ఓ వైపు రోడ్డులో కొంతమేర సురభి కళాకారులు గత 13 ఏళ్లుగా కళావేదికను ఏర్పాటు చేసుకుని అక్కడే స్థిర నివాసం ఉంటున్నారు. గతంలో నాటక ప్రదర్శనలు నిర్వహించిన వారు ఇప్పుడు ఎలాంటి ప్రదర్శనలు లేకున్నా.. అక్కడే తిష్టవేసి ఉన్నారు. అలాగే ఆడిటోరియం మరోవైపు రోడ్డులో మిగిలిన ఖాళీ స్థలాన్ని అధికారులు తరచూ వ్యాపార సంస్థలకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో తమ ప్రాంతం నడిబొడ్డులో ఆడిటోరియం ఉన్నా... తమకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయిందని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకోని కాలనీ సంక్షేమ సంఘం

వనస్థలిపురం నడిబొడ్డులో ఆడిటోరియం ఉన్నా.. అది అధ్వాన స్థితికి చేరుకుంటున్నా దాని అభివృద్ధిని పట్టించుకోవడంలో వనస్థలిపురం కాలనీ సంక్షేమ సంఘం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి రెండు, మూడు కమిటీలు మారినా ఎవరూ ఆడిటోరియం అభివృద్ధిని పట్టించుకోలేదని వారు విమర్శిస్తున్నారు. కాగా గత కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం పదవీ కాలం ముగియడం రాజకీయాలు చోటు చేసుకోవడంతో కార్యవర్గ ఎన్నికలో జాప్యం జరుగుతుండటంతో ఇక ఆడిటోరియం అభివృద్ధిని ఎవరు పట్టించుకుంటారని వారు పేర్కొంటున్నారు. స్థానిక కార్పొరేటర్ కూడా ఈ విషయంలో చొరవ చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకుని ఆడిటోరియంను మినీ రవీంద్రభారతిలా అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఆడిటోరియం అనుబంధ గదులు

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: అమీర్‌పేట్ గ్రామంలో కొలువైన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవార్లకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతి, గోదా సమేత అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. స్వామివార్లకు పుష్పార్చన, మూలదేవత హోమములు, ప్రసాద వితరణ, సాయంత్రం లక్ష్మి హోమం, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామాలు, పారాయణం, శ్రీలక్ష్మీదేవి కుంకుమార్చన ప్రసాద వితరణ పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దంపతులు హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, ఎంపీటీసీ పెంటల కుమారిరాయప్ప, శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఆవుల రమేశ్, ఉపాధ్యక్షులు జగదీష్, బుచ్చిబాబు చారి, కోశాధికారి భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ!

- ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు
- సొత్తు స్వాధీనం



నిందితుడు సంద్ర మహేశ్

హస్తినాపురం: పగటి పూట కాలనీల్లో రెక్కీ నిర్వహించి తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించడం.. రాత్రి వేళల్లో ఆ ఇళ్లలో చోరీలకు పాల్పడటం... ఇలా దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. . నల్లగొండ జిల్లా రావిపహాడ్ మండలం అప్పన్నగూడెం గ్రామానికి చెందిన సంద్ర మహేశ్ (27) కేర్‌టేకర్‌గా పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉంటున్నాడు. తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలన్న అత్యాశతో చోరీలు మొదలు పెట్టాడు. పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించి.. రాత్రి సమయంలో తాళం పగులగొట్టి ఆ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు ల్యాప్‌టాప్ , సెల్‌ఫోన్లను అపహరించుకెళ్తున్నాడు. వనస్థలిపురం ఠాణా పరిధిలో రెండు దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న మహేశ్‌ను గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు ల్యాప్‌టాప్, జేబీఎల్ స్పీకర్, ఆపిల్ ఐపాడ్, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పైప్‌లైన్ లీకేజీని పట్టించుకోని అధికారులు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని బాతుల చెరువు అలుగు జీ స్కూల్ మలుపు సమీపంలో తాగునీటి పైప్ లీకై నీరంతా వృథాగా పోతోంది. కొన్ని నెలలుగా ఇక్కడ నీరు లీకవుతుండటంతో రోడ్డంతా కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మలుపు వద్ద ఏర్పడ్డ ఈ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, లీకేజీని అరికట్టి ప్రమాదాలను నివారించాలని జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఈ సమస్యను పరిష్కరించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.